ప్రజాశక్తి

బుధవారం 10 జనవరి 2024

5

అనంతపురం



'మెట్టు' వైపే మొగ్గు..!

◆ రాయదుర్గం వైసిపి ఇన్‌ఛార్జి ఆయనకే..?
◆ కాంగ్రెసు వైపు కాపు చూపు..?
◆ సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరారెడ్డితో మంతనాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



మెట్టు గోవిందరెడ్డి

ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి వైసిపికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించడంతో అక్కడ కొత్తగా నియోజకవర్గ సమన్వయకర్త ఎవరన్న చర్చ నడుస్తోంది. మాజీ ఎమ్మెల్యే మెట్టుగోవిందరెడ్డిని నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించే అవకాశాలున్నట్టు ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. 2019 ఎన్నికలకు ముందు టిడిపి నుంచి వైసిపిలోకి మెట్టుగోవిందరెడ్డి చేరారు. ఆ తరువాత ఆయనకు ఎపిఐఐసి ఛైర్మన్ పదవినిచ్చారు. ప్రస్తుతం ఆయన ఎపిఐఐసి ఛైర్మన్‌గానున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాపు రామచంద్రారెడ్డి స్థానంలో మెట్టుగోవిందరెడ్డిని సమన్వయకర్తగా నియమించే అవకాశముందని భావించారు. ఇప్పుడు ఎమ్మెల్యేగానున్న కాపును కళ్యాణదుర్గంకు మార్పు చేస్తారని ఊహాగానాలు విన్పించాయి. అక్కడ ఆయన్ను నియమించకపోవడంతో పార్టీకి రాజీనామా చేసి బయటకు వెళ్లిపోయారు. ఆయన స్థానంలో ఇంకా వైసిపి రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తను నియమించలేదు. ఒకటి,రెండు రోజుల్లో నియమించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. వైసిపికి కొత్త సమన్వయకర్తగా మెట్టుగోవిందరెడ్డి ఉండే అవకాశాలే ఎక్కువగానున్నాయి. వైసిపిని వీడిన సందర్భంలో కాపు రామచంద్రారెడ్డి స్వతంత్రంగా పోటీ చేస్తానని ప్రకటించారు. అయితే ఆయన కాంగ్రెస్ వైపు అడుగులు వేస్తున్నట్టు కనిపిస్తోంది. మంగళవారం నాడు సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డిని భార్య కాపు భారతితో పాటు వెళ్లి కలిశారు. వైసిపి టిక్కెట్టు ఇవ్వకున్నా రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో పోటీ చేసి తీరుతామని కాపు ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో రఘువీరారెడ్డిని కలువడంతో ఆయన కాంగ్రెసు వైపు వెళ్తున్నారా అన్న చర్చ నడుస్తోంది. ఇప్పటికే వైసిపిని వీడిని అనేక మంది నాయకులు కాంగ్రెసులో చేరుతామని ప్రకటించారు. ఈయన కూడా అటు వైపే వెళ్లే అవకాశాలున్నాట్టు తెలుస్తోంది.



కాపు రామచంద్రారెడ్డి

2009లో కాపు రామచంద్రారెడ్డి కాంగ్రెసు పార్టీ నుంచి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మరణం తరువాత వైసిపి ఏర్పాటుతో కాంగ్రెసు పార్టీ, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వైసిపిలో చేరారు. వైఎస్.జగన్మోహన్‌రెడ్డి వెంట నడిచిన 12 మంది ఎమ్మెల్యేల్లో ఈయన ఒకరుగానున్నారు. ఆ తరువాత 2012లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ గెలుపొందారు. ఆ తరువాత 2014లో వైసిపి తరుపునే పోటీ చేసి ఓటమి చెందారు. 2019 ఎన్నికల్లో మరోమారు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇప్పుడు వైసిపి నుంచి బయటకొచ్చి తిరిగి పాత గూటికే చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్.రఘువీరారెడ్డి ద్వారా అయితే అటు కర్నాటక రాజకీయాల్లోనూ అవకాశం లభిస్తే వెళ్లేందుకు వీలుంటుందన్న ఉద్ధేశంతోనే ఆయన్ను కలిసినట్టు రాజకీయవర్గాలు చర్చ నడుస్తోంది. ఎందుకంటే కాపు రామచంద్రారెడ్డికి కర్నాటకలో పలువురితో సత్సంబంధాలున్నాయి. దీనికి రఘువీరారెడ్డి మద్దతు కూడా లభిస్తే అవకాశాలు అటువైపు కూడా మెరుగుపడవచ్చునన్న ఉద్ధేశంతోనే కాంగ్రెస్‌లోకి వెళ్లే యోచన చేస్తున్నట్టు తెలుస్తోంది. కర్నాటకలో ప్రస్తుతం కాంగ్రెసు పార్టీ అధికారంలో ఉంది. ఇక్కడ పార్టీ రాకపోయినా అటు వైపు వెళ్తే కొంత ప్రయోజనం చేకూరే అవకాశాలూ ఉంటాయన్న ఆలోచనతోనే కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నట్టు రాజకీయవర్గాలు భావిస్తున్నాయి.

ఎస్మాను రద్దు చేయాల్సిందే..!



అనంతపురంలో ర్యాలీ చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

◆ అనంతలో జైల్‌భరో విజయవంతం
◆ టవర్ క్లాక్ వద్ద బైటాయింపు
◆ నాయకుల అరెస్టులు
◆ అంగన్వాడీ, మున్సిపల్, సమగ్రశిక్షా ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించండి



గుత్తిలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వేతనాలు పెంచమంటే అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడం అత్యంత దుర్మార్గమని, దీనిని తక్షణం రద్దు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఎస్మాను రద్దు చేయాలని, అంగన్వాడీ, మున్సిపల్, సమగ్ర శిక్షా ఉద్యోగుల డిమాండ్లను తక్షణం పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని కోరుతూ కేంద్ర కార్మిక, ప్రజా సంఘాల అధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మంగళవారం నాడు జైల్‌భరో కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో కార్మికులు ఇందులో పాల్గొన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ ఈ కార్యక్రమం విజయవంతం అయ్యింది.

అనంతపురం నగరంలో మంగళవారం ఉదయం జైల్‌భరో కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా టవర్‌క్లాక్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అక్కడ బైటాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సమయంలో పోలీసులు కార్మిక సంఘాల నాయకులు, అంగన్వాడీ, మున్సిపల్ ఉద్యోగ కార్మికులను అరెస్టు చేశారు. అరెస్టుల అనంతరం ఆందోళనకారులందరూ ప్రదర్శనగా రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ వద్దకెళ్లి అక్కడ నిరసన తెలిపారు. కార్మికుల సమస్యలనైనా పరిష్కరించండి... జైళ్లో అయినా పెట్టండి.. అంటూ నినాదాలు చేశారు. 2 ,4 నగర సిఐలు శివరాములు, ప్రతాపరెడ్డి అధ్వర్యంలో పోలీసులు కార్మిక, ప్రజాసంఘాల నాయకులను అరెస్టుచేసి టూటౌన్ స్టేషన్‌కు తరలించారు. జైల్‌భరో అరెస్టు సందర్భంగా స్వచ్ఛందంగా వందలాదిమంది ఉద్యోగ, కార్మికులు అరెస్టు అయ్యారు. పోలీసులు వీరిని 151 సెక్షన్ కింద అరెస్ట్ చేసి అనంతరం విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు ఎస్.నాగేంద్ర కుమార్, రాజేష్‌గౌడ్, యేసురత్నం, పోతుల నరసింహులు మాట్లాడుతూ రోమ్ నగరం తగలడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయించినట్టు రాష్ట్రంలో రెండు లక్షల మంది కార్మికులు, ఉద్యోగులు పెరిగిన ధరల కనుగునంగా వేతనాలు, సౌకర్యాలు పెంచాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మెలు చేస్తుంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్ర అంటూ ఆటలాడుకుంటూ కాలక్షేపం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటి పన్నులు, కరెంటు ఛార్జీలు, చెత్త పన్ను, నిత్యవసరాలు ధరలు, పెట్రోలు డీజిల్ ధరలు ఈ నాలుగున్నరేళ్ల కాలంలో విపరీతంగా పెరిగాయన్నారు. నిరుద్యోగ సమస్య తాండవిస్తోందన్నారు. ఇలాంటి సమయంలో కార్మికుల వేతనాలు పెంచాలని సమ్మె చేస్తుంటే ముఖ్యమంత్రి పట్టించుకోకపోవడం విచాకరం అన్నారు. వేతనాలు పెంచమనేసరికి ఎస్మాను తెచ్చి బెదిరింపులకు దిగడం దుర్మార్గం అన్నారు. తక్షణం అంగన్వాడీలను ఎస్మా పరిధి నుంచి తొలగించి వారి న్యాయమైన సమస్యలన్నింటినీ పరిష్కరించాలన్నారు. మున్సిపల్ కార్మికులకు ధరల కనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. సమగ్రశిక్షా ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, మినిమం టైమ్ స్కేల్, రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిష్కరించకపోతే రాబోవు ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్ కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు యేసురత్నం, సిఐటియు జిల్లా అధ్యక్షులు నాగమణి, అంగన్వాడీ వర్కర్స్ వెల్ఫేర్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శకుంతల, రమాదేవి, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, ఎర్రిస్వామి, తిరుమలేష్, మల్లికార్జున, రాయుడు, ఓబులపతి, మంత్రి వరలక్ష్మి, చిరంజీవి, కష్ణుడు, టిఎన్‌టియుసి పోతుల నరసింహులు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, కౌలు రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల రంగయ్య, శివారెడ్డి, సిపిఎం నగర కార్యదర్శులు ఆర్‌వి.నాయుడు, రామిరెడ్డి, సిఐటియు నాయకులు వెంకటనారాయణ, ముత్తుజా, మన్నీల రామాంజనేయులు, ఆటో వర్కర్స్ యూనియన్ శ్రీనివాసులు ఆదినారాయణ, ఆజంబాషా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కష్ణమూర్తి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

టిడిపితోనే మైనార్టీల సంక్షేమం

పొలిట్‌బ్యూరో సభ్యులు షరీఫ్, కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం



సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి మాజీ అధ్యక్షులు ఎంఎ షరీఫ్

తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, శాసనమండలి మాజీ అధ్యక్షులు ఎంఎ షరీఫ్, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం రాయదుర్గంలోని అజీజి యా షాదీ మహల్‌లో టిడిపి ముస్లిం మైనారిటీల నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి షాదీ మహల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ టిడిపి హయాంలో రాష్ట్రంలో ముస్లింల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చినట్లు గుర్తు చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముస్లిములకు నామమాత్రంగా బడ్జెట్లో నిధులు కేటాయించారన్నారు. వాటిని కూడా నవరత్నాలకు మళ్లించారని ఆరోపించారు. అంతేగాకుండా మైనారిటీలపై దాడులు, అత్యాచారాలు, అరాచకాలు పెరిగిపోయాయన్నారు. తమ పార్టీ సుప్రీంకోర్టులో పోరాటం చేసి నాలుగు శాతం రిజర్వేషన్ సాధనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. టిడిపితోనే సమ సమాజ స్థాపనకు సాధ్యమన్నారు. తాము రూపొందించే కరపత్రాలను ప్రతి మసీదు, ప్రతి ముస్లిం ఇంటికీ చేర్చాలని కోరారు. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్, ప్రస్తుత వైసిపిలు కేవలం ఓటు బ్యాంకుగా వాడుకున్నాయన్నారు. రాజకీయంగా వారిని ఎదగనివ్వలేదన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రంలో మైనారిటీలకు సంక్షేమ పథకాలు అమలు కాలేదన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు గౌస్ మొహద్దీన్, టిడిపి రాష్ట్ర పరిశీలకులు పర్వీన్‌తాజ్, మాజీ ఎమ్మెల్యే అత్తర్ చాంద్‌బాషా,. టిడిపి మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షులు సాలార్ బాషా, విశ్రాంత ఎస్పీ షేక్షావలి, మైనార్టీ విభాగం నియోజకవర్గ అధ్యక్షులు మహబూబ్‌బాషా, టిడిపి నాయకులు సనావుల్లా, ఉస్మాన్, జమీల్‌ఖాన్, జిలాన్, టిడిపి పట్టణ అధ్యక్షుడు నాగరాజు ప్రధాన కార్యదర్శి ఇనాయత్ బాషా, మున్సిపల్ వార్డు సభ్యులు ప్రశాంతి, జ్యోతి, మాజీ సభ్యులు భారతి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులంటే అంత నిర్లక్ష్యమా..

కొనసాగుతున్న సమ్మె - పలుచోట్ల రాస్తారోకోలు - రాయదుర్గంలో నడుముకు వేపాకు కట్టుకుని నిరసన

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపల్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె మంగళవారం గుత్తిలో 15వ రోజుకు చేరుకుంది. వీరికి సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వి.రాంభూపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసి ఆరునెలల్లోపు మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని జగన్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కరోనా సమయంలో మున్సిపల్ కార్మికుల కాళ్లు కడిగి ఆ నీటిని నెత్తిన చల్లుకుని కార్మికులకు ఒక్కొక్కరికి లక్ష ఇచ్చినా తక్కువే అన్న ప్రధాని మోడీ మాట ఏమైందని నిలదీశారు. కార్మికుల సమ్మెతో పట్టణాలు చెత్తాచెదారంతో దుర్గంధం వస్తుంటే ప్రభుత్వానికి కనపడలేదా.. అన్నారు. వెంటనే సుప్రీంకోర్టు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం శిబిరం వద్ద వంటావార్పు చేసి సహాపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి వి.నిర్మల, అధ్యక్షుడు ఎం.మల్లేష్, రైతుసంఘం నాయకుడు బి.రామకృష్ణ, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, ఐద్వా నాయకురాలు కవిత, మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్టు కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.రామాంజనేయులు, కె.సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు కె.మహేష్, సహాయ కార్యదర్శి టి.సుంకన్న, కోశాధికారి బాలరంగన్న, నాయకులు బేడల నాగేంద్ర, ఈశ్వరయ్య, కె.అంజనేయులు, ఇంజనీరింగ్ కాంట్రాక్టు కార్మికుల యూనియన్ అధ్యక్షుడు ఎస్.రాజా, ఉపాధ్యక్షుడు ఎస్ఎ. మురళి, కార్యదర్శి రవిశంకర్, సహాయ కార్యదర్శి నరసింహా, కోశాధికారి నక్క శేఖర్, నాయకులు శేఖర్, ఓబులేసు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన ఆందోళనలో భాగంగా మంగళవారం రాయదుర్గంలో పంగనామాలు పెట్టుకుని, నడుముకు వేపాకు చుట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ నిన్న రాష్ట్రవ్యాప్తంగా జరిగిన కలెక్టరేట్ల ముందు ధర్నాల్లో కార్మికులపై పోలీసులు వ్యవహరించిన తీరు సరైంది కాదన్నారు. మహిళా కార్మికులు అని కూడా చూడకుండా పురుష పోలీసులు రోడ్లపై ఈడ్చుకుంటూ తీసుకెళ్లడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి మున్సిపల్ కార్మికులు మనుషుల్లాగా కనబడడం లేదా.. అని ప్రశ్నించారు. అదేవిధంగా సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులను రాడికల్స్‌తో పోల్చిన పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మాటలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. వెంటనే ఆయన తన మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు రాము, తిప్పేస్వామి, మల్లేష్, వెంకటేశులు, నాయకులు తిప్పేరుద్ర, మైలారప్ప, ఓబన్న, నరసింహులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



రాయదుర్గంలో నడుముకు ఆకులు కట్టుకుని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు,

కార్మికులతో ప్రజాప్రతినిధుల చర్చలు

స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని ఛైర్‌పర్సన్ ఛాంబర్‌లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళుశిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి మున్సిపల్ కార్మికులతో చర్చించారు. పట్టణంలో 15రోజుల నుంచి కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టడం వల్ల తాగునీటి సమస్య తీవ్రంగా ఏర్పడిందన్నారు. ప్రత్యామ్నాయంగా కొంతమంది ఇంజనీరింగ్ కార్మికులు విధులకు హాజరుకావాలని, రెగ్యులర్ కార్మికులను, చెత్త ట్రాక్టర్లను అడ్డుకోకూడదని విజ్ఞప్తి చేశారు. ఇందుకు కార్మికులు స్పందిస్తూ యూనియన్ నాయకులతో చర్చించి తెలియజేస్తామన్నారు. ఈ సమావేశంలో వైస్‌ఛైర్మన్ వలిబాషా, వైసిపి నాయకులు పోరాళు శివ, వార్డు సభ్యులు శివకుమార్, శివప్ప, దివాకర్, రామాంజనేయులు, నిజాముద్దీన్, కృష్ణమూర్తి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, సిపిఎం నాయకులు నాగరాజు , మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



గుత్తిలో దీక్ష శిబిరంలో కూర్చొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

పోలింగ్ స్టేషన్ల నివేదికలను సమర్పించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

సాధారణ ఎన్నికల నేపథ్యంలో రెండు రోజుల్లోపు ప్రతి పోలింగ్‌స్టేషన్‌ను తనిఖీ చేసి ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ఫార్మాట్లలో నివేదికలు సమర్పించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సెక్టోరియల్ అధికారులు రెండు రోజుల్లోపు ప్రతి పోలింగ్‌స్టేషన్‌ని తనిఖీ చేయాలన్నారు. ఇందులో భాగంగా ఆయా పోలింగ్‌స్టేషన్లలో కనీస సదుపాయాలు ఉన్నాయా.. లేదా.. పోలింగ్ స్టేషన్లు డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఎంత దూరంలో ఉన్నాయి.. అన్ని ఒకేరూట్‌లో ఉన్నాయా, గ్రామాల్లో సమావేశం నిర్వహించాలన్నారు. అలాగే ఇంతకుముందు గ్రామాల్లో కక్షలు, గొడవలు, కొట్లాటలు ఏమైనా జరిగాయా, రిగ్గింగ్ జరిగిందా, రీపోలింగ్ ఏమైనా జరిగిందా.. తదితర అన్ని అంశాలపై నివేదికలు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో ఇఆర్‌ఒ వెంకటనారాయణమ్మ, తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, బెలుగుప్ప, కూడేరు, వజ్రకరూరు, విడపనకల్లు, ఉరవకొండ మండలాల తహశీల్దార్లు, సెక్టోరియల్ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఊపిరున్నంత వరకూ జగన్‌తోనే..

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి-శింగనమల



సిఎం జగన్‌తో ఎమ్మెల్యే పద్మావతి దంపతులు

'నా ఊపిరి ఉన్నంత వరకూ ముఖ్యమంత్రి జగన్‌తోనే నడుస్తామని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. సామాజిక మాద్యమంలో నీటి సమస్యపై మాట్లాడిన నేపథ్యంలో మంగళవారం సిఎం జగన్ తాడేపల్లికి పిలిపించుకుని చర్చించారు. అనంతరం మంగళగిరిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆమె మాట్లాడుతూ సామాజిక మాద్యమంలో తన నియోజకవర్గ నీటి సమస్యపై మాట్లాడుతూ కొన్ని మీడియా పత్రికలు, ఛానళ్లు వక్రీకరించి చెప్పాయని ఆరోపించారు. సిఎం జగన్ స్ఫూర్తితోనే తనతోపాటు తన భర్త, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి నడుస్తామన్నారు.

సాహితీ వైభవం.. సాంస్కృతిక సౌరభం..!

వైభవోపేతంగా "అనంత" తెలుగు భాషా వైభవ సదస్సు-ఆకట్టుకున్న 'జయహో కృష్ణదేవరాయ' నృత్యరూపకం

ప్రజాశక్తి-అనంతపురం



తెలుగు భాషా సేవ జీవిత సాఫల్య పురస్కారం అవార్డును అందుకుంటున్న రచయితలు

అనంతపురం నగరంలోని జెఎన్‌టియు ఆడిటోరియంలో మంగళవారం నాడు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివద్ధి ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో "అనంత" తెలుగు భాషా వైభవ సదస్సు కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షులు పి.విజయబాబు, ఏపీ సిఆర్ మీడియా అకాడమీ ఛైర్ పర్సన్ కొమ్మినేని శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సులో భాగంగా నిర్వహించిన "జయహో కష్ణదేవరాయ" నత్యరూపకం ఎంతగానో ఆకట్టుకుంది. అంతకుముందు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షులు కుమారుడు కౌశిక్ శ్రీకష్ణదేవరాయలుగా నిర్వహించిన నాటిక సబికులను కట్టిపడేసింది. "అనంతపురం జిల్లా నాటకం : బళ్లారి రాఘవ" అనే అంశంపై గుత్తా హరిసర్వోత్తమ నాయుడు ప్రసంగించారు.

తెలుగు భాషా సేవ జీవిత సాఫల్య పురస్కార గ్రహీతలు

తెలుగు భాషా సేవ జీవిత సాఫల్య పురస్కారం గ్రహీతలకు జ్ఞాపక, శాలువా, పారితోషికం అందించారు. పదిమందికి ఈ పురస్కారాన్ని అందజేశారు. అందులో ఆచార్య మూడే గోనా నాయక్, కంబదూరి షేక్ నబీరసూల్, చొప్ప వీరభద్రప్ప, జయలక్ష్మి రాజు, జెట్టి జైరామ్, డా॥ఆదవాని హనుమంతప్ప, డా॥ఆమళ్లదిన్నె వెంకటరమణ ప్రసాద్, డా॥కల్లూరి ఆనందరావు, డా॥కేతు బుచ్చిరెడ్డి, సొంటి జయప్రకాష్‌లకు తెలుగు భాషా సేవ జీవిత సాఫల్య పురస్కారం అందించారు. 38 మందికి తెలుగు భాషా సేవా ప్రతిభ పురస్కారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి విసి చింతా సుధాకర్, జేఎన్టీయూ రిజిస్ట్రార్ శశిధర్, డిఆర్డిఎ పీడీ నరసింహారెడ్డి, జిల్లా టూరిజం అధికారి నాగేశ్వరరెడ్డి, డిఈఓ నాగరాజు, డిప్యూటీ డిఈఓ శ్రీదేవి, డివిఈఓ వెంకట రమణ నాయక్, అధికార భాషా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

అంగన్వాడీల జైల్‌భరో

జిల్లావ్యాప్తంగా రాస్తారోకోలు - గుత్తిలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, నాయకుల అరెస్టు

ప్రజాశక్తి-గుత్తి

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మెలో భాగంగా జైలుభరో కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం నుంచి నాయకులు, అంగన్వాడీలు ప్రదర్శనగా ఎన్టీఆర్ సర్కిల్‌కు చేరుకున్నారు. అక్కడ వాహనాల రాకపోకలను అడ్డుకుని రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ బి.నబిరసూల్, సిబ్బందితో చేరుకుని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్‌తోపాటు, వామపక్ష పార్టీ నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం తప్పుడు పద్ధతులను అవలంబిస్తోందన్నారు. సిఎం జగన్ ఎన్నికల ముందు తెలంగాణ కంటే అధికంగా అంగన్వాడీలకు వేతనాలు ఇస్తానని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. ఆ హామీలను అమలు చేయాలని అంగన్వాడీలు సమ్మె చేపడితే ఎస్మా చట్టాన్ని అమలు చేయడం అన్యాయమన్నారు. వెంటనే అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం నాయకులను సొంత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మల్లేష్, వి.నిర్మల, రైతుసంఘం నాయకుడు బి.రామకృష్ణ, ఐద్వా మండల నాయకురాళ్లు ఎన్.రేణుక, కవిత, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి. రమేష్, సిపిఐ మండల కార్యదర్శి జి.రామదాసు, నాయకులు రమేష్, నరసింహ, రాజు, నజీర్, అశోక్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు కళ్యాణి, పార్వతి, శారద, బావమ్మ, శోభారాణి, నాగరత్న, గంగ, తదితరులు పాల్గొన్నారు.


జైల్ భరో అరెస్టు సందర్భంగా గుత్తి పోలీసు స్టేషన్‌లో ఉన్న అంగన్‌వాడీలు, కార్మిక సంఘం నాయకులు


పామిడిలో ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు

ఉరవకొండతోపాటు విడపనకల్, వజ్రకరూరు మండల కేంద్రాల్లో చేపట్టిన సమ్మె మంగళవారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా జైల్‌భరో కార్యక్రమం చేపట్టారు. ఈ సందరంగా ఉరవకొండలో అంగన్వాడీలు, నాయకులు రాస్తారోకో చేస్తుండగా అర్బన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ తిమ్మయ్య చేరుకుని అంగన్వాడీలు, సిపిఎం నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మధుసూదన్, విరపాక్షి, సుధాకర్, రంగారెడ్డి, సిపిఐ నాయకులు చెన్నారాయుడు, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఇంద్రావతి, బోయ ఓబులేసు, డిసిసి నాయకులు సోనియా సీనా, అబ్బాస్, బీఎస్పీ నాయకులు ప్రభాకర్, అంగన్వాడీలు విజయ, అరుణకాంతమ్మ, దుర్గాదేవి, రంగమ్మ, శ్వేతనాగు, సరోజమ్మ, బ్యులా, ధనలక్ష్మి, జ్యోతి, రామంజినమ్మ, లోకమ్మ, నాగమణి, శివశ్రీ, సువర్ణమ్మ, శశికళ, లక్ష్మీదేవి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు మండల కేంద్రంలో అంగన్వాడీ సమ్మె మంగళవారం కొనసాగింది. వీరికి వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ మద్దతు తెలిపింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సూరి, అంగన్వాడీ యూనియన్ మండల నాయకురాళ్లు జయలలిత, శశికళ, అనంతలక్ష్మి, రమాదేవి, రైతుసంఘం నాయకులు జి.వెంకటచౌదరి, వ్య.కా.సం నాయకులు టి.పెద్దయ్య, బి.భాస్కర్, నాగభూషణ్, అంగన్వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో సీఎం జగన్ చిత్రపటానికి కళ్లకు గంతలు కట్టడంతోపాటు అంగన్వాడీలు సైతం కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. వెంటనే సీఎం గతంలో ఇచ్చిన హామీ మేరకు తమ న్యాయమైన కోరికలను తీర్చాలని విజ్ఞప్తి చేశారు.

పామిడి మండల కేంద్రంలో అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. వీరికి రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు అనిమిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ ఎద్దులపల్లి సెక్టార్ యూనియన్ లీడర్ మహాలక్ష్మి, పామిడి సెక్టార్ యూనియన్ లీడర్ జయంతి, అంగన్వాడీలు నారాయణమ్మ, భారతి, జ్యోతి, యశోద, అనిత, సేకున్ బి, సోఫియా, రజియా, రెహనా, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట మండల పరిధిలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగింది. ఈ కార్యక్రమంలో సెక్టార్ కార్యదర్శి మేరీ, అంగన్వాడీలు రాధిక, మెఫ్రోన్, చంద్రకళ, రుద్రమ్మ, మల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారం కూడా కొనసాగాయి. ఇందులో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన దీక్ష శిబిరంలో వేప ఆకులు తింటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నాగేంద్ర, సంజీవరెడ్డి, నెట్టికల్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

గుంతకల్లులోని వైఎస్ఆర్ కూడలిలో ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక సాధికార బస్సుయాత్ర ముందు అంగన్వాడీలు నల్ల బెలూన్లతో నిరసన తెలిపారు. అదేవిధంగా మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కాంట్రాక్టు కార్మికులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంలో 1వ పట్టణ సీఐ రామసుబ్బయ్య అత్యుత్సాహం చూపుతూ బూట్లతో మహిళలను తొక్కుతూ నల్ల బెలూన్లు పగులకొట్టారు. దీంతో సీఐ చర్యలను నిరసిస్తూ నినాదాలు చేయడంతో కొద్దిసేపు వాగ్వివాదం చోటు చేసుకుంది. అనంతరం సామాజిక సాధికార బస్సుయాత్రకు వచ్చిన ఎంపి నందిగాం సురేష్, ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కసాపురం రమేష్, సాకే నాగరాజు, సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, జగ్గలి రమేష్, అంగన్వాడీ వర్కర్ల యూనియన్ నాయకులు రేష్మా, గంగ, నాగమణి తదితరులు డిమాండ్ చేశారు.



గుంతకల్లు, ఉరవకొండలో అంగన్వాడీలు, నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు


బుక్కరాయసముద్రంలో ఆకులు తింటూ నిరసన

సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక విన్సెంట్‌ఫెర్రర్ నగర్‌లోని షిరిడీ సాయి మోక్షిత్ హైస్కూల్‌లో మంగళవారం సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కె.సుబ్బారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మి సుబ్బారెడ్డి పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం భోగి మంటలు, పాల పొంగుళ్లు ఏర్పాటు చేశారు. తర్వాత భోగి పండ్లు చిన్నపిల్లలపై పోసి ఆశీర్వదించారు. మీద పోసి వారిని ఆశీర్వదించారు. అనంతరం గంగిరెద్దుల కోలాటం, హరిదాసుల కీర్తనలు, సంక్రాంతి ముత్యాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తెలుగు జాతి సంస్కృతి, సంప్రదాయాలకు నెలవుగా సంక్రాంతి పండుగ నిలుస్తుందని బృహస్పతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ రవిశంకర్ ప్రసాద్ అన్నారు. మంగళవారం నగరంలోని బృహస్పతి పాఠశాలలో సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల సంప్రదాయ వేషధారణలు, రంగవల్లులు, గొబ్బెములతో అలరించారు. రంగవల్లులు విజేతలకు డిప్యూటీ మేయర్ దాసరి వాసంతిసాహిత్య, కార్పొరేటర్ లావణ్య బహుమతులు అందజేశారు.


మోక్షిత్ పాఠశాలలో భోగి పళ్లతో చిన్నారిని ఆశీర్వదిస్తున్న అధ్యాపకులు


డిప్యూటీ మేయర్ వాసంతిసాహిత్యను సన్మానిస్తున్న బృహస్మతి పాఠశాల యాజమాన్యం


కోమటికుంట్లలో మాట్లాడుతున్న ఎస్ఐ దిలీప్‌కుమార్

గ్రామాల్లో నాకాబందీ

పుట్లూరు : మండలంలోని కోమటికుంట్ల గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఇందులో భాగంగా పుట్లూరు ఎస్ఐ దిలీప్ కుమార్, యల్లనూరు ఎస్ఐ ధరణిబాబు, సిబ్బందితో కలిసి అనుమానితుల ఇళ్లు, కళ్లందొడ్లను పరిశీలించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి గొడవలకు వెళ్లకుండా ప్రశాంత జీవనం సాగించాలని సూచించారు.

ఆత్మకూరు : మండలంలోని గొరిదిండ్ల డికె.తండాలో మంగళవారం తెల్లవారుజామున పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కె.జనార్ధన ఆధ్వర్యంలో అనుమానితులు ఇళ్లు, గడ్డివాములను పరిశీలించారు.


ఆత్మకూరు మండలంలో మాట్లాడుతున్న ఎస్ఐ జనార్ధన్

మహారాజశ్రీ గుత్తి ఆరవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

I.A. No: 527/2023 Gardion.O.P. No:33/2023

Between:

పాదర్తి గోపాలరావు S/o పి.ఆంజనేయులు, డోర్ నెం:2-47, దేవగుడూరు, జారుగుమల్లి మండలం, ప్రకాశం జిల్లా. ...పిటీషనర్

And

నిల్ ...రెస్పాండెంట్

ప్రకటన

పై కేసు నందు పిటిషనర్ పై అర్జీ అనగా I.A. No: 527/2023 ను పై గార్డియన్ పిటిషన్ నందు తనను తమ మైనరు మనువరాలు అయిన పి.లక్ష్మి దీపిక, తండ్రి లేట్ పాదర్తి వెంకటేశ్వర్లు, హిందువు, వయస్సు 15 సం॥లు కు ఆమెకు, ఆస్తికి గార్డియన్‌గా నియమించమని పైన తెలిపిన గార్డియన్ పిటిషన్ నందు సవరణ చేయమని కోరుతూ దాఖలు చేసి యున్నాడు. కావున పై కేసు నందు పిటిషనర్ తన మైనరు మనువరాలు పి.లక్ష్మి దీపికకు వ్యక్తికి మరియు ఆమె ఆస్తికి గార్డియన్‌గా నియమించమని మరొక ప్రార్తనను పై గార్డియన్ పిటిషన్ నందు చేర్చుటకు సవరణ కోరుతూ దాఖలు చేసిన పై అర్జీ నందు ఎవరికైనా ఏమైనా అభ్యంతరాలు వున్న యెడల పై కోర్టు నందు వాయిదా తేది:12/01/2024 న హాజరై తెలుపుకొనవలెను.

జి.లక్ష్మీపతి, అడ్వకేట్, గుంతకల్లు

శ్మశాన వాటికల్లో అధిక వసూళ్లను అరికట్టాలి

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపాలిటీ పరిధిలోని హిందూ, క్రైస్తవ శ్మశాన వాటికల్లో అధికంగా డబ్బుల వసూళ్లను అరికట్టాలని పట్టణంలోని పైమాలగేరి, బండగేరి, కుమ్మరగేరి, బెస్తగేరి, కోట వీధికి చెందిన పలువురు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ లలితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన వైపి.బాబు, వై.వాసు అనిల్ కాంత్, బేల్దారి చంద్ర, రంగముణి, ఓబయ్య మాట్లాడుతూ పట్టణ శివార్లలోని నేమతబాదు వద్ద ఉన్న క్రైస్తవ శ్మశాన వాటికతోపాటుగా మరికొన్ని శ్మశానాల్లో మృతదేహాలు పూడ్చేందుకు పట్టణానికి చెందిన రంగనాయకులు, అతని కుమారులు వేలకు వేలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు స్పందించి గుంతల తవ్వేందుకు రూ.1500 నుంచి రూ.3వేలు మధ్య ధర నిర్ణయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జె.అబ్రహం, ఎం.సొలమాన్ రాజు, ఎం.బాలు, ఆర్‌బి.రమేష్, బి.శ్రీనివాసులు, బి.కొండరాయుడు, తదితరులు పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు లలితకు వినతిపత్రం సమర్పిస్తున్న గుత్తివాసులు

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి : ఎమ్మెల్యే తోపుదుర్తి

ప్రజాశక్తి-ఆత్మకూరు

గతంలో ఏం అభివృద్ధి జరిగింది.. వైసిపి అధికారంలోకి వచ్చాక ఏం అభివృద్ధి జరిగిందో చూసి వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండలంలోని తోపుదుర్తి గ్రామంలో కొత్త పింఛన్లను పంపిణీ చేశారు. ముందుగా రైతు భరోసా కేంద్రం, సచివాలయ భవనం, బహుళ ప్రయోజన సౌకర్య గోడౌన్‌ను ప్రారంభించారు. తర్వా ఓవర్‌హెడ్ ట్యాంకు, రామాలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి హయాంలో నియోజకవర్గ వ్యాప్తంగా 20 వేల పింఛన్లు ఇస్తే, తాము అధికారంలోకి వచ్చాక 49 వేల పింఛన్లు ఇస్తున్నామన్నారు. ఒక్క తోపుదుర్తి పంచాయతీలోనే నాలుగున్నరేళ్లలో రూ.27 కోట్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించామన్నారు. అంతేగాకుండా ప్రతి పథకం నేరుగా లబ్ధిదారుల వద్దకే వస్తోందన్నారు. వీటన్నింటినీ చూసి ఓటేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, ఎంపిపిలు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఛైర్మన్లు, డైరెక్టర్లు, గృహ సారథులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, స్టోర్ డీలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న సచివాలయ సిబ్బంది

సంతకాల సేకరణ

పామిడి : మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీ సచివాలయంలో మంగళవారం బి.ఆర్.అంబేద్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ నాగరాజు, వెల్ఫేర్ సెక్రటరీ ఈశ్వరయ్య, డిజిటల్ అసిస్టెంట్ ఎం.జీ.అనూష, మహిళా పోలీస్ కే.సీ.రాధా, వీఆర్‌ఓలు పరంజ్యోతి, మనోజ్‌కుమార్, రామాంజనేయులు, రమేష్, వెంకటరాముడు, సచివాలయ కన్వీనర్ శివ, పామిడి టౌన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు శివ, మాజీ కౌన్సిలర్ రాజు పాల్గొన్నారు.

చిన్నచెరువును నీటితో నింపాలి

ఉరవకొండ : పట్టణంలో చిన్న చెరువుకు హంద్రీనీవా నీటితో నింపి జీవరాసులు దాహార్తిని తీర్చాలని జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. పట్టణ ప్రజలు, సమస్త జీవరాసులను దృష్టిలో ఉంచుకుని సర్పంచి లలితమ్మ ప్రత్యేక చొరవతో చిన్న చెరువును నీటితో నింపాలని కోరారు.

బస్సుయాత్రకు తరలిన వైసిపి శ్రేణులు

పామిడి : గుంతకల్లులో మంగళవారం చేపట్టిన సామాజిక సాధికార బస్సుయాత్రకు పట్టణం నుంచి వైసిపి శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. తరలివెళ్లిన వారిలో మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ చెన్నకేశవరెడ్డి, పట్టణ కన్వీనర్ జోజోడే కుమార్, కొండాపురం సునీల్‌రెడ్డి, బోగాతి మురళీమోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాయకులు ఈశ్వర్‌రెడ్డి, రామిరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, పారతీశ్వర్‌రెడ్డి, కొత్తపల్లి రమేష్‌రెడ్డి, కాలాపురం నారపరెడ్డి, అనుంపల్లి సూరి, శివ, మునగల రంగనాయకులు, కొండూరు బబ్లూ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

నార్పల : పేదలకు మెరుగైన సంపూర్ణ ఆరోగ్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యమని జిల్లా మేనేజింగ్ ఆఫీసర్ ఓబులు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బండ్లపల్లి గ్రామంలో ఏర్పాటు చసిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' మెగా వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం కోసం వచ్చిన ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు అవసరమైన మందులు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ దివాకర్, పప్పూరు వైద్యశాల డాక్టర్లు మహేంద్ర, హాజీరా, ఇఒఆర్‌డి శైలజారాణి, ఎంపీహెచ్ఈఓ మల్లికార్జున, ఎంపిహెచ్ఎస్ శ్రీరాములు, ఎఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతులకు షెడ్లు మంజూరు

నార్పల : ఉపాధి హామీ పథకంలో భాగంగా ఐదెకరాల్లోపు భూమి ఉన్న రైతులు పశువులు పోషించుకునేందుకు షెడ్ల నిర్మాణానికి ప్రభుతం నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు నార్పల, పప్పూరు వెటర్నరీ డాక్టర్లు గోవిందరాజులు, రాధిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి 50 పశువుల షెడ్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బుక్కరాయసముద్రం : పాడి రైతులు మండలానికి మంజూరైన పశువుల షెడ్లను సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఏవి రత్నకుమార్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో భాగంగా పాడి పశువులు ఉన్న రైతులకు పశువుల షెడ్లు నిర్మిచేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కావున మండలంలోని ఆసక్తి ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల బిటెక్ 3వ సంవత్సరం 1వ సెమిస్టర్ (ఆర్20), 4వ సంవత్సరం 1వ సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్ పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. విద్యార్థులు పరీక్ష ఫలితాల కోసం కళాశాల అకాడిమిక్ సెక్షన్‌ను సంప్రదించాలని ప్రిన్సిపల్ ఎస్.వి.సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఇ.అరుణకాంతి, పి.ఆర్.భానుమూర్తి, టి.బాల నరసయ్య, డిప్యూటీ కంట్రోలర్ అఫ్ ఎక్సామినేషన్స్ డి.విష్ణువర్ధన్, డి.లలితకుమారి, విభాగాలు అధిపతులు కె.ఎఫ్.భారతి, ఎం.రామశేఖరరెడ్డి, కె.కళ్యాణిరాధ, ఎ.శైలాకుమారి, డాక్టర్ కళ్యాణి రాధ, తదితరులు పాల్గొన్నారు.


బీటెక్ ఫలితాలను విడుదల చేస్తున్న అధికారులు

అణగారిన వర్గాలకు సిఎం జగన్ పెద్దపీట

ప్రజాశక్తి-గుంతకల్లు

సామాజిక సాధికార బస్సుయాత్ర సభలో నాయకులు

అణగారిన వర్గాలకు రాజకీయాల్లో సామాజిక న్యాయం చేసి పెద్దపీట వేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ఎంపీలు నందిగాం సురేష్, తలారి రంగయ్య, ఎమ్మెల్యేలు వై.వెంకట్రామిరెడ్డి, అఫీజ్‌ఖాన్, మాలగుండ్ల శంకర్‌నారాయణ, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఎలక్ట్రానిక్ మీడియా ప్రభుత్వ సలహాదారు సినీ నటుడు ఆలీ అన్నారు. మంగళవారం గుంతకల్లులోని అపోలో కూడలిలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహం వద్ద సామాజిక సాధికార బస్సుయాత్ర బహిరంగ సభ ఏర్పాటు చేశారు. అంతకు ముందుగా ఆలూరు రోడ్డులోని ఓ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గాంధీజీ కలలుకన్న సమసమాజ స్థాపన కోసం సిఎం జగన్ అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా అణగారిన వర్గాలకు రాజకీయాలలో అగ్రస్థానం ఇచ్చారన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు పాలనలో అణగారిన వర్గాలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకున్నారన్నారు. అదే వైసిపి అధికారంలోకి వచ్చాక అణగారిన వర్గాలకు న్యాయం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ భవాని, వైస్ ఛైర్‌పర్సన్లు మైమున్, నైరుతీరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ గాదిలింగేశ్వర బాబు పాల్గొన్నారు.


సంఘీభావం తెలుపుతున్న వైసిపి ప్రజాప్రతినిధులు


చంద్రన్నతోనే రాష్ట్రాభివృద్ధి : టిడిపి

కుందుర్పి : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బెస్తరపల్లి గ్రామంలో 'బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి మల్లికార్జున, మాజీ సర్పంచి రాఘవేంద్రబాబు, ఉన్నం వరలక్ష్మి, ఉన్నం మారుతీచౌదరి, గొల్ల వెంకటేశులు, మోరేపల్లి మల్లికార్జున, పాపంపల్లి రామాంజనేయులు, ఆవుల తిప్పేస్వామి, రాంబాబు, రామమూర్తి, రాధాకృష్ణ, సత్తన్న, తెలుగు తమ్ముళ్లు, మహిళలు పాల్గొన్నారు.


చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి

ఆలయ హుండీ లెక్కింపు

ఉరవకొండ : మండల పరిధిలోని పెన్నఅహోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉన్న ఆరు శాశ్వత హుండీలను దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో మంగళవారం లెక్కించారు. 106 రోజులకుగాను రూ.22,71,551, బంగారం 2.205 మిల్లీగ్రాములు, వెండి 20.650 గ్రాముల వచ్చినట్లు పర్యవేక్షణాధికారి ఉరవకొండ డివిజన్ ఇన్స్‌పెక్టర్ కె.రాణి, అలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ హనుమాన్ సేవ సమితి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఇవిఎంలపై అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్ ఉషారాణి

ఇవిఎంలపై అవగాహన

గార్లదిన్నె : మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో తహశీల్దార్ ఉషారాణి ఆధ్వర్యంలో ఇవిఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషిన్)ల పనితీరుపై మంగళవారం ఓటర్లకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వివి ప్యాట్ల పనితీరుపై వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, ఇఒఆర్‌డి వెంకటలక్ష్మి, బిఎల్ఒ గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు గేట్స్ విద్యార్థుల ఎంపిక

గుత్తి : పట్టణంలోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల చెందిన విద్యార్థులు ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మంగళవారం స్థానిక కళాశాలలో 'అసెంచర్' అనే ప్రముఖ మల్టీనేషనల్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులు జాబ్‌మేళా నిర్వహించారు. 23 మంది విద్యార్థులు రూ 4.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీకే. పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, మేనేజింగ్ డైరెక్టర్ గజ్జల రఘునాథ్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శాంతి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇంతియాజ్ బాషా, ప్లేస్‌మెంట్ అధికారి తన్వీర్, అధ్యాపకులు పాల్గొన్నారు.


ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో గేట్స్ యాజమాన్యం

విగ్రహావిష్కరణకు తరలిరండి

కళ్యాణదుర్గం : ఈనెల 19న విజయవాడలో 125 అడుగులతో ఏర్పాటు చేస్తున్న బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కణకు నియోజకవర్గం నుంచి భారీగా తరలిరావాలని ఎంపీ తలారి రంగయ్య పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని సుబ్రమణ్యేశ్వర కళ్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జనవరి 19న చేపట్టాల్సిన కార్యక్రమాలపై నాయకులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రాజ్‌కుమార్, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ తలారి రంగయ్య

దళితులపై ఎమ్మెల్యే పద్మావతి కపటప్రేమ

ప్రజాశక్తి-గార్లదిన్నె

'జొన్నలగడ్డ'పై దళితుల ఆగ్రహం

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి నాలుగున్నరేళ్లలో కనబడని దళితులు ఇప్పుడు గుర్తుకొచ్చారా.. అంటూ దళిత సంఘాల నాయకులు మండిపడ్డారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పలువురు దళిత సంఘాల నాయకులు విలేకరులతో మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో దళితులపై ఎన్నో అఘాయిత్యాలు, దౌర్జన్యాలు జరుగుతున్నప్పటికీ నోరు మెదపని పద్మావతి ఇప్పుడు ఎమ్మెల్యే సీటు నిరాకరించడంతో దళితులపై ఎనలేని కపట ప్రేమను వలకబోస్తోందన్నారు. ఎప్పుడూ తమ నాయకులను పొగడడం తప్ప నియోజకవర్గంలోని దళితులు, వారి సమస్యలపై ఒక్కసారైనా ప్రశ్నించిందా.. అన్నారు. అంతేగాకుండా నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఆరుగురు రెడ్లకు పెత్తనం కట్టి అగ్రవర్ణాల ఆధిపత్యం కోసం దళితుల అణచివేతను పెంచి పోషించింది మీ భర్త ఆలూరు సాంబశివరెడ్డి కాదా.. అని నిలదీశారు. ఎట్టి పరిస్థితుల్లో వారిని నమ్మబోయే పరిస్థితుల్లో నియోజకవర్గంలోని దళితులు లేరన్నారు. ఎమ్మెల్యే పద్మావతి ఇప్పటికైనా కుటుంబం కోసం కాకుండా ప్రజల కోసం పనిచేయాలని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో ముకుందాపురం నాగరాజు, బండారు కుళ్లాయప్ప, బూదేడు రామాంజనేయులు, కన్నంపల్లి ప్రసాద్, బూదేడు మల్లికార్జున, కల్లూరు పవన్‌కుమార్, రాము, నల్లప్ప, నల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న దళిత సంఘం నాయకులు